RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 339 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం మంగళవారం, 11 జూన్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# దూకేద్దామా..!?

## కాంగ్రెస్‌తో టచ్‌లో.. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!
## పార్టీ మారేందుకు ముఖ్య నేతలతో మంతనాలు
## సీఎం రేవంత్, వేం నరేందర్‌తో సంప్రదింపులు
## గ్రేటర్ హైదరాబాద్ పరిధి శాసనసభ్యులే అధికం
## టీడీపీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి వెళ్లినవారే

## ఈ నెలాఖరులోగానే ఎక్కువమంది ఫిరాయింపు

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో రాష్ట్రంలో ఎమ్మెల్యేల ఫిరాయింపుల పర్వం మొదలుకానుంది. ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసన సభ్యులు కాంగ్రెసలోకి వెళ్లేందుకు మంతనాలు ప్రారంభించారు. వచ్చే ఐదేళ్ల పాటు సౌకర్యంగా ఉండే ఆలోచనతో కొందరు పార్టీ మారేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అధికార పార్టీ ముఖ్యులతో అంతర్గత సంప్రదింపులు, చర్చలు సాగిస్తున్నారు. అటునుంచి అనుమతి లభించినదే తడవుగా జంప్ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలా 10 మందికి పైగా గులాబీ ఎమ్మెల్యేలు కాంగ్రెసతో టచ్‌లోకి వెళ్లినట్లు సమాచారం. వీరంతా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయన ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో చర్చల్లో ఉన్నారు. అంతా బాగుంటే ఈ నెలలోనే భారీగా మార్పులు ఉండొచ్చని తెలుస్తోంది. వాస్తవానికి ఇలాంటివారిని ఉద్దేశించే సీఎం రేవంత్ బుధవారం నర్మగర్భ వ్యాఖ్యలు చేశారని చెబుతున్నారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ నేతలు, ఎమ్మెల్యేల ఆత్మగౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని, కమలం పార్టీకి ఓట్లు మళ్లేలా చేయడంతో ఏడు ఎంపీ సీట్లలో బీఆర్ఎస్ డిపాజిట్లు కోల్పోయిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ లాంటి పార్టీలో కొనసాగే విషయమై 'ఆత్మప్రబోధానుసారం' నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. కాగా.. 'మరికొద్ది నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇచ్చేది నేనే' అంటూ ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే చెప్పుకొంటున్నారు. ఆయన కాంగ్రెసలోకి వెళ్తారని అందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని చెబుతున్నారు. ఇలాంటివారు 10 మందిపైగా కాంగ్రెసతో టచ్‌లో ఉన్నారని తెలిసింది. కాగా, ఎవరిని తీసుకోవాలి? ఎవరిని తీసుకోవద్దు? అనే అంశంపై సీఎం రేవంత్ స్పష్టతతో ఉన్నారు. అందరినీ చేర్చుకుంటూ పోతే, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారి గురించి సమాధానం చెప్పుకోవాల్సి వస్తుందని, తద్వారా చెడ్డ పేరు వస్తుందని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసలోకి మారే యోచనలో ఉన్న ఎమ్మెల్యేల్లో ఎక్కువమంది జీహెచ్ఎంసీకి చెందినవారే. టీడీపీలో ఉండగా రేవంత్‌తో కలిసి పనిచేసి, బీఆర్ఎసలోకి వెళ్లినవారు, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎసలోకి మారినవారు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 39 సీట్లు నెగ్గగా అందులో 16 జీహెచ్ఎంసీ పరిధివే. వీరిలోనే కొంతమంది కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. నెలాఖారుకల్లా వీరు పార్టీ మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఇప్పటికే ముగ్గురు జంప్!...** బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో ఇప్పటికే కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం) కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాషగౌడ్ సీఎం రేవంత్‌ను కలిసినా.. ఆ తర్వాత వెనక్కుతగ్గారు. ఇదే సమయంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి (దుబ్బాక), సునీతాలక్ష్మారెడ్డి (నర్సాపూర్), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), కె.మాణిక్‌రావు (జహీరాబాద్) కూడా సీఎంను కలిశారు. వీరు కాంగ్రెసలోకి వెళ్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, వారు ఖండించారు. అభివృద్ధి పనుల కోసమే సీఎం వద్దకు వెళ్లినట్లు చెప్పారు. కాగా, పార్లమెంటు ఎన్నికలు రావడంతో దాదాపు మూడు నెలలుగా ఫిరాయింపులు ఆగాయి. ఎమ్మెల్యేలు చడీ చప్పుడు చేయలేదు. ఇప్పుడు ఎన్నికలు ముగియడంతో ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా కూడా ఉన్న సీఎం రేవంత్ నుంచి అనుమతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, దీనిపై వేం నరేందర్‌రెడ్డి కాస్త చొరవ తీసుకుంటున్నారు. కాంగ్రెసలో చేరే యోచన ఉన్న ఎమ్మెల్యేలు వీరిద్దరితో పాటు ఇతర కీలక నేతలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. బీఆర్ఎసలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి పెద్దగా నిధులు అందవని భావిస్తున్నారు. దీని బదులు అధికార పార్టీలో చేరి సౌకర్యంగా ఉండొచ్చన్న ఆలోచన చేస్తున్నారు.

## బీజేపీలో సంస్థాగత మార్పులుంటాయన్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్: బీజేపీలో సంస్థాగత మార్పులు త్వరలో ఉంటాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీ కాలాన్ని ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా కొనసాగించారన్నారు. ఇప్పుడు ఆ పదవీకాలం పూర్తయిందన్నారు. అధ్యక్ష మార్పు అనివార్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో



కూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తనకు మంత్రి పదవితో పాటు పార్టీ అధ్యక్ష పదవిని అప్పగించారని కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి కాబట్టి తెలంగాణ సహా ఇంకా అనేక రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్ష మార్పులు ఉంటాయని వెల్లడించారు. కేబినెట్ కసరత్తు పూర్తయిన నేపథ్యంలో పార్టీ సంస్థాగత మార్పులపై త్వరలోనే కసరత్తు చేసి కొత్తవారిని నియమిస్తారని కిషన్ రెడ్డి వెల్లడించారు.




## రూ.430 కోట్లతో ఆధునీకరణ పనులు పూర్తి
## అందుబాటులోకి వస్తే సిటీలో మిగిలిన స్టేషన్లపై తగ్గనున్న ఒత్తిడి
## ప్రస్తుతం మనుగడ లోనున్న లైన్లలోనే రైళ్ల రాకపోకల నిర్వహణ
## కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే ప్రారంభం

హైదరాబాద్ : చర్లపల్లి మోడ్రన్ రైల్వేస్టేషన్ ఓపెనింగ్ కు రెడీ అయింది. కొద్దిపాటి పనులు స్టేషన్ ను త్వరగా ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే అధికారులు పనుల్లో నిమగ్నం అ య్యారు. మోడ్రన్ స్టేషన్ దేశంలోని మరే ఇతర ప్రధాన రైల్వేస్టేషన్లకు దీటుగా పలు ప్రత్యేకతలతో నిర్మిం చినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్ల తర్వాత స్థానంలో చర్లపల్లి మోడ్రన్ స్టేషన్‌కు నిలుస్తుందని చెప్పారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ఓపెన్ చేస్తారని అధికారులు పేర్కొన్నారు. దీంతో రైల్వేస్టేషన్ తుది దశ అభివృద్ధి పనులను స్పీడ్ గా నడుస్తున్నాయి.


**రూ.430 కోట్లతో ప్రాజెక్టు :** చర్లపల్లి రైల్వే టెర్మినల్ ను రూ. 430 కోట్ల వ్యయంతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆధునీకరించారు. ఇందులో పలు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రయాణికులకు వసతులను కల్పించారు. భారీ సంఖ్యలో ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా కొత్తగా నిర్మించే స్టేషన్ బిల్డింగ్ ను అత్యంత ఆధునికంగానే కాకుండా అందమైన ముఖద్వారంతో నిర్మించారు. స్టేషన్ లో గ్రౌండ్ ఫ్లోర్ లో ఆరు టికెట్ బుకింగ్ కౌంటర్లు, లేడీస్, పురుషుల వెయిటింగ్ హాల్స్, ఎగువ తరగతి వెయిటింగ్ హాల్, ఎగ్జిక్యూటివ్ లాంజ్, మొదటి అంతస్తులో కేఫేటేరియా, రెస్టారెంట్, స్త్రీ, పురుషులకు రెస్ట్ రూమ్స్ ఉన్నాయి. స్టేషన్ బిల్డింగ్ లో విశాలమైన కాన్కోర్స్ ప్రాంతాలు, స్టేషన్ ముఖద్వారానికి అత్యాధునిక లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అదనంగా 4 ఎత్తైన ప్లాట్ ఫారాలు ఉంటాయి. ఇప్పటికే ఉన్న 5 ప్లాట్ ఫామ్ లను కూడా పూర్తి నిడివితో పునర్నిర్మాణం చేశారు. రెండు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, 12 మీటర్ల వెడల్పు, మరొకటి 6 మీటర్ల వెడల్పుతో - ప్లాట్?ఫారాల మధ్య కదలికను సులభతరం చేయడానికి అనువుగా రూపొందించారు. మొత్తం 9 ప్లాట్ ఫారాల్లో ఎస్కలేటర్లు, లిఫ్టులు ఉంటాయి. ఇందులో 7 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు ప్రయాణికుల కోసం నిర్మించారు. స్టేషన్ నుంచి రైళ్లను ప్రారంభించేందుకు కోచ్ నిర్వహణ సౌకర్యాలను కూడా కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఇవేకాకుండా ప్రయాణికులకు బస్ బే ఏర్పాటు చేశారు. రైలు సూచిక బోర్డులతో పాటు 4-, 3-, 2 -వీలర్స్ కు పార్కింగ్ ఏరియా, అన్ని ప్లాట్ ఫారాల్లో పబ్లిక్ అనౌన్స్ మెంట్ సిస్టమ్, యట్ ఏ గ్లాన్స్ బోర్డులు, 24 గంటలు సీసీటీవీ నిఘా వ్యవస్థ ను అమర్చారు. మొత్తానికి చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను అంతర్జాతీయస్థాయిలో రూపుదిద్దినట్టు అధికారులు తెలిపారు. హైదరాబాద్ లో మిగిలిన స్టేషన్లకు దీటుగా చర్లపల్లి రూపుదిద్దుకుంది.

**సిటీలో కీలకం :** జంట నగరాల్లో ప్రధానంగా 3 ప్రధాన రైల్వే టెర్మినల్స్ ఉన్నాయి. సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ ద్వారా ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. సిటీలో రోజురోజుకూ పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను తీర్చడానికి, సిటీకి పశ్చిమ వైపున లింగంపల్లిని మరొక రైల్వే టెర్మినల్ స్టేషన్ గా అభివృద్ధిచేశారు. ఇదేవిధంగా చర్లపల్లి రైల్వేస్టేషన్ ను కూడా మరో టెర్మినల్ స్టేషన్ గా దక్షిణ మధ్య రైల్వే అధికారులు డెవలప్ చేస్తున్నారు. సిటీకి తూర్పు వైపున చర్లపల్లి ఉంది. దీంతో ఆ ప్రాంతం స్పీడ్ గా అభివృద్ధి చెందడంతో పాటు ప్రతిష్టాత్మకమైన ఔటర్ తో అనుసంధానానికి సమీపంలోనే ఉంది. తద్వారా ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేకాకుండా జంట నగరంలోని ఇతర రైల్వే టెర్మినల్స్‌లోనూ రద్దీని తగ్గించడం, ముఖ్యంగా సిటీకి తూర్పున ఉండే ప్రయాణికులకు సేవలను అందించేందుకు కూడా స్టేషన్ ను రైల్వే టెర్మినల్ స్టేషన్ గా అభివృద్ధి చేశారు.

# అక్కడ గెలుపుతో ఇక్కడ ఊపు!

## బీఆర్ఎస్ ను క్లోజ్ చేయడమే లక్ష్యంగా స్కెచ్

## పట్టున్న ప్రాంతాల్లో ఎంట్రీ ఇచ్చి రాష్ట్రమంతా విస్తరించే ప్లాన్




హైదరాబాద్: ఏపీలో గెలుపు తెలంగాణ తెలుగు తమ్ముళ్లలో జోష్ నింపింది. అదే ఉత్సాహంతో సైకిల్ సవారీకి రెడీ అవుతున్నారని తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో టీడీపీ ప్రాభవం కోల్పోయింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 15 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన తెలుగుదేశం పార్టీ.. 14.55% ఓట్లను పొందగలిగింది. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలకు పడిపోయింది. ఓట్ల శాతం కూడా 3.51శాతానికి పడిపోయింది. 2018 ఎన్నికల సమయంలో కాంగ్రెస్, టీడీపీ కలిసి కూటమిగా ఏర్పడి పోటీ చేయగా కాంగ్రెస్ కు 19 సీట్లు వచ్చాయి. ఆ తర్వాత 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయలేదు. ఆ తర్వాత 2023లో తెలంగాణ తెలుగుదేశం పార్టీ సిద్ధమైంది. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు టీడీపీ అధినేత చంద్రబాబు. ఖమ్మం, సికింద్రాబాద్ లలో భారీ బహిరంగసభలు నిర్వహించిన చంద్రబాబు తెలంగాణలోకి ఎంట్రీ ఇస్తున్నట్టు ప్రకటించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన సమయంలో చంద్రబాబు అరెస్టయ్యారు. రాజమండ్రి జైల్లో ఉన్నారు. తెలంగాణలో పోటీకి నిరాకరించడంతో కలత చెందిన కాసాని నేరుగా హైదరాబాద్ వచ్చి బీఆర్ఎస్ లో చేరిపోయారు. దీంతో అప్పటి దాకా ఊపు మీదున్న తమ్ముళ్లు ఒక్క సారిగా డీలా పడిపోయారు. ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు నుంచి టీడీపీ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ తరఫున బరిలోకి దిగిన నామా నాగేశ్వర్ టీడీపీలో చేరి సైకిల్ గుర్తుపై పోటీ చేస్తారని అది కాస్తా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం బక్కని నర్సింహులు, అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు ఇంకా టీడీపీలోనే కొనసాగుతున్నారు.

**బీఆర్ఎస్ స్థానం భర్తీ చేసేలా..** తెలంగాణలో నిర్వీర్యమైన బీఆర్ఎస్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు టీడీపీ అధినేత ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఇక్కడ పార్టీని నేతలు వీడారు. కార్యకర్తలు తెలుగుదేశంతోనే ఉన్నారని వారంతా అలాగే ఉన్నారు. ఈ సమయంలో పార్టీ ఎదుగుదలపై దృష్టిపెట్టడం సరైన నిర్ణయమని ఆయన భావిస్తున్నారు. కేంద్రంలో కూడా తెలుగుదేశం మద్దతు కీలకం కావడంతో బీఆర్ఎస్ లోకి వెళ్లిన టీడీపీ నేతలంతా భవిష్యత్తు కోసం ఆలోచించి తిరిగి టీడీపీలోకి వస్తారనే అంచనాలున్నాయి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## 'ఇండియా' ఎఫెక్ట్: చిన్న పార్టీలకు పెద్ద పీట మోడీ వ్యూహం ఏంటి?

కేంద్రంలో కొలువు దీరుతున్న మోడీ సర్కారు ఈ సారి గతానికి భిన్నంగా ఎన్డీయే కూటమిలోని చిన్న పార్టీలకు పెద్ద పీట వేసింది. తమకు కలిసి వచ్చి.. కష్ట సమయంలో(పూర్తి మెజారిటీ లేని) ఆదుకున్న ప్రతిపార్టీకీ పదవిని ఆఫర్ చేసింది. దీంతో ఆయా పార్టీలను.. మోడీ తన పరిధి నుంచి పక్కకు జరగకుండా చూసుకునేందుకు.. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి అవకాశం ఇవ్వకుండా చేసేందుకు చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. కేంద్ర మంత్రి వర్గంలో సంఖ్యాబలం ప్రకారం.. మొత్తం 55 మంది మంత్రులు ఉండేందుకు అవకాశం ఉంది. సహాయ మంత్రులతో కలిపితే.. ఈ సంఖ్యకు మరో 30కి పెరిగినా.. సందేహం లేదు. ఈ నేపథ్యంలో తాజాగా 30 మందితో ప్రధానిగా నరేంద్ర మోడీ సాయంత్రం ప్రమాణం చేస్తున్నారు. ఇక, ఏపీ నుంచి 16 సీట్లు దక్కించుకున్న టీడీపీకి రెండు పదవులు ఇచ్చారు. ఇక, బిహార్ అధికారం పార్టీ, కూటమిలో కీలక రోల్ పోషిస్తున్న జేడీయూకు కూడా రెండు పదవులు ఆఫర్ చేశారు. అలానే.. కేవలం 4 నుంచి 6 ఎంపీలను గెలుచుకున్న పార్టీలకు కూడా తన మంత్రివర్గంలో మోడీ చాన్స్ ఇచ్చారు. వీరిలో కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ ఎంపీ హెచ్డీ కుమారస్వామి, బిహార్‌కు చెందిన ఎల్జేపీ (రామ్‌విలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, హిందుస్థాన్ అవామీ మోర్చా పార్టీ అధినేత జితన్ రామ్ మాంఝీ, అప్నాదళ్ (ఎస్) అధ్యక్షురాలు అనుప్రియా పటేల్, ఆర్ఎల్డీకి చెందిన జయన్ చౌదరిలకు కూడా.. మోడీ అవకాశం ఇచ్చారు. వీరి పార్టీలకు ఇద్దరు నుంచి నలుగురు మాత్రమే ఎంపీలు ఉన్నారు. ఇక, బీజేపీలో మాజీ సీఎంలు అందరికీ మంత్రి వర్గంలో చోటు కల్పించారు. వీరిలో మధ్య ప్రదేశ్ మాజీ సీఎంలు శివరాజ్ సింగ్ చౌహాన్, కర్ణాటక బసవరాజ్ బొమ్మై, హరియాణ మాజీ సీఎం మనోహర్ లాల్ ఖట్టర్, అస్సాం మాజీ సీఎం సర్బానంద సోనోవాల్ కూడా ఉన్నారు. మొత్తంగా ఎన్డీయేకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఇండియా కూటమిని కట్టడి చేసి.. అక్కడికి ఎవరూ వెళ్లకుండా చేయడమే వ్యూహంగా ఉందని తెలుస్తోంది. ఎందకంటే.. ఏ పది మంది జారి పోయినా.. ఇబ్బందులు తప్పేలా లేవు. ఇక, మాజీ సీఎంలకు అవకాశం ఇవ్వడం వెనుక.. ఆయా రాష్ట్రాల్లో త్వరలోనే ఎన్నికలు జరగనుండడం కారణంగా మారింది.

# అనుమతి ఎంత.. తరలిస్తున్నదెంత?



గోదావరిఖని: అదో మాఫియా సామ్రాజ్యం.. అక్కడ రెండు నుంచి మూడు వాహనాలు పహారాకాస్తాయి. చుట్టూ ఎవరూ రాకుండా చేతిలో కర్రలు, ఇతర ఆయుధాలతో పలువురు నిత్యం సంచరిస్తుంటారు. అటుగా ఎవరైనా కొత్త వారు కనిపిస్తే వెంటనే దాడి చేయడానికి సైతం వెనుకాడరు. కేవలం మట్టి తరలించే టిప్పర్లు.. లారీలు తప్ప మరో వాహనం అటుగా వెళ్లాలంటే జంకాల్సిందే. ఇదంతా మట్టి అక్రమ రవాణా దందాకు సంబంధించిన దృశ్యాలు. అంతర్గాం మండలం ముర్మూర్ చెరువులోంచి మట్టిని తరలించేందుకు అనుమతి పొందిన ఇటుక బట్టీల యజమాని అందులోంచి ఎంత వరకు తరలిస్తున్నారన్నది లెక్కేలేదు. మొత్తం 15,500 మెట్రిక్ టన్నుల సిల్టు మట్టిని రవాణా చేసేందుకు నీటిపారుదల శాఖ నుంచి అమనుతి పొందిన సదరు ఇటుక బట్టీ నిర్వాహకుడు లెక్కకు మించి రవాణా చేస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ లెక్కలు వేసుకోవడానికి లాగ్‌బుక్ నిర్వహించడం లేదు. ముందుగా 3000 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు అనుమతి పొందిన సదరు ఇటుక బట్టీ నిర్వాహకుడు ఆ తర్వాత మరో 12,500 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు అనుమతి తీసుకున్నారు. దీనికి గాను సీనరేజ్, డీఎంఎఫ్టీ, ఆదాయ పన్ను తదితరాలు కలిపి రూ.5,35,000 ప్రభుత్వ శాఖలకు చెల్లించాడు. అధికారికంగా అనుమతి తీసుకున్నప్పటికీ అక్కడ ఎంతలోతు వరకు మట్టిని వెలికి తీయాలి... ఎంత తరలిస్తున్నారన్న విషయంలో పర్యవేక్షణ కనిపించడం లేదు.

ముంపు గ్రామ చెరువులో పూడికతీతా?

ఎల్లంపల్లి వెనుక జలాలతో ముర్మూర్ గ్రామం ముంపునకు గురైంది. ప్రస్తుతం ఆ గ్రామానికి చెందిన చెరువు కూడా నీటిలోనే మునిగిపోయింది. ఎల్లంపల్లి నీటినిల్వ తగ్గడంతో పాత ముర్మూర్ గ్రామం బయటపడింది. గ్రామానికి చెందిన చెరువు ప్రస్తుతం వినియోగంలో లేదు. సాగయ్యే పంట భూములు సైతం లేవు. అలాంటి చెరువులో పూడిక తీత పేరుతో మట్టి తరలించేందుకు అనుమతి ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి నిల్వలు తగ్గిపోవడంతో బయటపడిన గ్రామానికి చెందిన చెరువులోంచి మట్టిని తీసేందుకు నీటిపారుదల శాఖ ఇచ్చిన అనుమతుల వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాత్రి వేళ మట్టి రవాణా

చెరువు మట్టి తరలింపులో కనీస నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పగటి పూట మొత్తం చెరువు నుంచి తీస్తున్న మట్టిని అదే గ్రామ శివారులో నిల్వ చేసుకుంటున్నారు. గుట్టలుగా పోసుకుంటున్న మట్టిని రాత్రి వేళల్లో ఇటుక బట్టీల ప్రాంతానికి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం పగటి పూట మాత్రమే చెరువులోంచి మట్టిని తరలించాల్సి ఉంటుంది. దానికి విరుద్ధంగా ఇటుక బట్టీ యజమానులు రాత్రి వేళల్లో నిల్వ చేసుకున్న ప్రాంతం నుంచి మట్టిని టిప్పర్ల ద్వారా పెద్దపల్లి ప్రాంతాల్లోని వివిధ ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎంత మట్టిని తరలించారన్న విషయంలో అధికారులు లెక్కలు వేయడం లేదు. దీంతో ఇటుక బట్టీ నిర్వాహకుడిదే ఇష్టారాజ్యంగా నడుస్తోంది. మొత్తం 15,500 మెట్రిక్ టన్నుల మట్టిని తరలించేందుకు అనుమతి పొందిన సదరు ఇటుక బట్టీ యజమాని ఇప్పటి వరకు అంతకు రెండింతల మట్టిని తరలించినట్లు తెలుస్తోంది. ఒక టిప్పర్‌లో 20 నుంచి 30 క్యూబిక్ మీటర్ల మట్టి రవాణా చేసే అవకాశం ఉండగా రోజుకు వందల టిప్పర్ల ద్వారా మట్టిని రవాణా చేస్తున్నారు.

మట్టి తరలింపు నిలిపివేసేందుకు చర్యలుచెరువు నుంచి రాత్రి పూట మట్టితరలిస్తున్నారనే విషయం మాదృష్టికి వచ్చింది. దీంతో మట్టి తరలింపును పూర్తిగా నిలిపివేసేందుకు నోటీసులు పంపించాం. ఒకటి రెండు రోజుల్లో కింది స్థాయి అధికారులు స్వయంగా వెళ్లి నోటీసులు ఇచ్చి, మట్టి రవాణాను నిలిపివేస్తారు. ఇప్పటి వరకు తరలించిన మట్టి లెక్కలు గణించేందుకు కొలతలు తీసుకుంటాం. అధికంగా మట్టి తరలించిన వారిపై తదుపరి చర్యలు చేపడతాం.-సుధాకర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజినీర్

# అంతర్మథనం



కరీంనగర్: ఏం.. జరిగింది? ఎక్కడ వెనుకబడిపోయాం? ఇంకా ఓట్లు రాబట్టాలంటే ఏం చేయాల్సి ఉండె? అంటూ కాంగ్రెస్, భారాస పార్టీలు అంతర్మథనం చెందుతున్నాయి.. సార్వత్రిక సమరంలో పలుచోట్ల వెనుకబడిపోవటానికి కారణాల్ని అన్వేషిస్తున్నాయి. జరిగిన తప్పిదాలు, లోటుపాట్లపై దృష్టి పెట్టాయి. తెలంగాణ ఉద్యమం మొదలు.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు ఉమ్మడి జిల్లాలో హవా చూపిన గులాబీ పార్టీ ఒక్కసారిగా తన ప్రాబల్యాన్ని కోల్పోయిన పరిస్థితిని పార్టీ శ్రేణులు ఊహించుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో అధికారం పోయిన తరువాత కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల్లో ఒకటి, రెండు సీట్లనైనా గెలుద్దామనే ఉద్దేశంతో ప్రచారంలో జోరును చూపించినప్పటికీ.. ఫలితాల వరకు వచ్చేసరికి బోల్తాపడాల్సిన పరిస్థితి భారాసకు ఎదురైంది. పోటీ చేసిన మూడు స్థానాల్లో మూడో స్థానానికే అభ్యర్థులు పరిమితమవ్వాల్సి వచ్చింది. రాష్ట్రంలో అధికారం దక్కిందనే జోష్‌తో కాంగ్రెస్ పార్టీ కూడా ఈ ఎన్నికల్ని ప్రతిష్ఠాత్మక పోరుగానే భావించినప్పటికీ.. ఒక స్థానంలో గెలిచి మిగతా రెండు చోట్ల ఓటమి పాలయింది.. పైగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే అన్ని అసెంబ్లీ సెగ్మెంట్‌లలో తక్కువ ఓట్లు పడటం కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహం పెంచింది.

అధికారంలో ఉన్నా..అయిదున్నర నెలల కిందటే రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఈ ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులే ఎదురయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఆదరణ లోక్‌సభ ఎన్నికల్లో రాకపోవడంతో పార్టీ శ్రేణులు జరిగిన తప్పిదాలు, కారణాల్ని అన్వేషిస్తున్నాయి. ఆయా పోలింగ్ బూత్‌ల వారీగా ఓట్లు ఎందుకు తగ్గాయనే విషయమై నాయకులు చర్చించుకుంటున్నారు. కరీంనగర్ స్థానంలో పార్టీ అభ్యర్థిని ఆలస్యంగా ప్రకటించడం ఇబ్బంది పెంచిందని.. నామినేషన్ల సమయంలో టికెట్ వచ్చినా.. భారాసపై పై చేయి సాధించి ద్వితీయ స్థానంలో నిలిచామని ఆ పార్టీ నాయకులు అంటారు. జగిత్యాల, కోరుట్లలో అనుకున్న విధంగా ఓట్లను పొందలేకపోయామనే భావనలో కాంగ్రెస్ నాయకులున్నారు. రైతులు సహా మహిళల ఓట్లు అనుకున్న విధంగా పడలేవనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. పెద్దపల్లి లోక్‌సభ స్థానంలో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వారే ఉన్నా.. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన విధంగా ఓట్లు పొందలేకపోవడం ఇబ్బందికరంగా మారింది. ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓట్లు తగ్గడాన్ని అక్కడి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పార్టీ నాయకులు ఇంకాస్త శ్రద్ధపెట్టి ఉంటే ఓట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉండేదని పార్టీలో చర్చ జరుగుతోంది. మూడు స్థానాల పరిధిలో 13,18,571 ఓట్లు వచ్చి దాదాపుగా 37 శాతం ఓట్లను హస్తం గుర్తు పార్టీ సంపాదించింది. 13 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ఓటింగ్ శాతం తమకు అనుకూలంగా రాకపోవడంలో లోపాలపై దృష్టిని సారిస్తున్నారు.

ముందే ప్రకటించినా..?

భారాసకు ఈ ఎన్నికల్లో ఊహించని ఫలితం ఎదురైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఓడినప్పటికీ కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఓటింగ్ శాతం ఎక్కువగానే ఉండటంతో గెలుపు సాధ్యమనే భావించింది. ఇందుకోసం ముందుగానే మూడు చోట్ల పార్టీ అభ్యర్థులను ఖరారు చేసి క్షేత్రస్థాయికి పంపింది. ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలు, ఎండిన పంటలు, విద్యుత్తు సంక్షోభాన్ని ప్రచారాయుధంగా మలచుకుంది. భారాస అధినేత కేసీఆర్ కరీంనగర్ నుంచే కదనభేరితో లోక్‌సభ ఎన్నికల శంఖం పూరించారు. బస్సు యాత్రలతో శ్రేణుల్లో జోష్‌ను నింపారు. ఓవైపు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పార్టీని వీడుతున్నప్పటికీ నాయకులు, కార్యకర్తలను నమ్ముకుని ప్రచారంలో పట్టు సడలనివ్వలేదు. అయినప్పటికీ ఓటర్లు అనుకున్న విధంగా మద్దతు తెలపలేదు. రాష్ట్రంలో అధికారంలో లేకపోవడంతోపాటు జాతీయ పార్టీల పోరుగా సార్వత్రిక సమరం మారడంతో ఒకవేళ భారాస అభ్యర్థి గెలిచినా కేంద్రంలో చేసేదేమీ ఉండదనే ఉద్దేశంతోనే చాలామంది ఓటర్లు గులాబీ పార్టీకి మద్దతు విషయంలో వెనక్కి తగ్గారని ఆ పార్టీ నాయకులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. మూడు లోక్‌సభ స్థానాల పరిధిలో 36,13,276 ఓట్లు పోలవగా అందులో 5,77,925 ఓట్లు మాత్రమే భారాసకు వచ్చాయి. కేవలం 16 శాతం ఓట్లను ఆ పార్టీ అభ్యర్థులు సాధించారు. 21 సెగ్మెంట్‌లలో దాదాపుగా సగానికిపైగా చోట్ల నామమాత్రపు ఓట్లే పడటం శ్రేణుల్ని కలవర పరిచింది.

# ఆయిల్‌పాం..దిగుబడుల భయం..!

అశ్వారావుపేట : దిగుబడులు తగ్గటంతో ఆయిల్‌పాం రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఆయిల్‌పాం తోటల దిగుబడులు వస్తుంటాయి. ఈసారి జూన్ మాసంలోకి ప్రవేశించినా ఆశించిన దిగుబడులు చేతికందలేదు. అనేక చోట్ల చెట్లకు పూత గెలలు సైతం బయటపడకపోవటం గమనార్హం. వాతావరణంలో మార్పులే కారణమా..?ఈసారి రైతులు యాజమాన్య పద్ధతులు సక్రమంగా పాటించలేదా? నీటితడుల విషయంలో తేడాలున్నాయా? తెగుళ్లు సోకాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈఏడాది ఏప్రిల్, మే నెలల్లో పరిశ్రమలకు పెద్దగా దిగుబడులు రావటం లేదని తెలియటంతో రైతుల్లో ఆందోళన రెట్టింపయ్యింది. దీనికితోడు కొంతకాలంగా పట్టిపీడిస్తున్న తెల్లదోమతో దిగుబడి తగ్గిందా అని సందేహిస్తున్నారు. తెల్లదోమ అధికంగా సోకటం, వేసవిలో అధిక ఎండలు, ఏప్రిల్, మే మాసాల్లో వర్షాలు కురవకపోవటం వంటివి కారణాలు అని నిపుణులు అంచనా వేస్తున్నారు అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో గెలల క్రషింగ్ ఇంకా మొదలుకాలేదు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 80వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుండగా.. వీటిలో 50వేల ఎకరాల్లో మాత్రమే దిగుబడులు వస్తున్నాయి. గతేడాది ఏడు మాసాలను పోల్చితే ఈసారి 17,340.17 టన్నుల దిగుబడి తగ్గింది.

ఆయిల్‌పాం తోటల్లో దిగుబడులు తగ్గుతున్నాయని రైతులెవరూ అధైర్యపడొద్దు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వర్షాలు కురవలేదు. వర్షాల్లో జాప్యం వల్లే దిగుబడులు ఆలస్యంగా వస్తున్నాయి. ఇప్పుడిప్పుడే వానలు కురుస్తుండటంతో పూత గెలలు బయటకొస్తున్నాయి.

# పల్లెల్లో కారు.. పట్టణంలో కమలం

సిద్దిపేట : లోక్‌సభ ఎన్నికల్లో పల్లెవాసులు భారాస వైపు మొగ్గు చూపారు. దీంతో ఆ పార్టీ నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పురజనం.. భారతీయ జనతా పార్టీకి జైకొట్టారు. గత ఎన్నికలతో పోల్చితే కాంగ్రెస్ పుంజుకున్నా.. మూడోస్థానానికి పరిమితమైంది.మెదక్ లోక్‌సభ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో అందులో భాగమైన సిద్దిపేట నియోజకవర్గంలో ఫలితాలను చూస్తే ఇదే స్పష్టమవుతోంది. పార్టీల నాయకులు పోలింగ్ కేంద్రాల వారీగా సాధించిన ఓట్లపై ఆరా తీస్తున్నారు. ఎక్కడ వెనుకబడ్డామనే విషయాన్ని గుర్తిస్తూ ఫలితాలను విశ్లేషిస్తున్నారు.

2 శాతం వ్యత్యాసం..

సిద్దిపేట జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. పార్టీల వారీగా చూస్తే.. గులాబీ పార్టీ 38 శాతం ఓట్లతో మొదటి స్థానంలో, భాజపా 36 శాతంతో ద్వితీయ, కాంగ్రెస్ 19 శాతంతో తృతీయ స్థానంలో నిలిచింది. భారాస, భాజపా మధ్య కేవలం 2 శాతం మాత్రమే వ్యత్యాసం స్పష్టమవుతోంది. లోక్‌సభ స్థానంలో మొత్తంగా చూస్తే భారాస ఓడినా.. సిద్దిపేట ప్రాంతంలో మాత్రం మిగిలిన పార్టీలతో పోల్చితే పైచేయి సాధిస్తూ ఎక్కువ ఓట్లను ఒడిసిపట్టింది. మరోవైపు మెజార్టీ తగ్గుదలకు కారణాలపై ఆ పార్టీ నేతలు నిశితంగా తెలుసుకుంటున్నారు. అత్యధిక శాతం ఓటు బ్యాంకు ఉన్నప్పటికి ఆశించిన లక్ష్యం ఎందుకు నెరవేరలేదనే కోణంలో సమాలోచనలు చేస్తున్నారు. పట్టణం సహా నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కాంగ్రెస్ మూడో స్థానంలో నిలవడం చర్చనీయాంశమైంది.

సిద్దిపేట పట్టణంలో..

సిద్దిపేట పట్టణంలో లక్షకు పైగా ఓటర్లుండగా.. 66,956 మంది ఎన్నికల్లో తమ హక్కును వినియోగించుకున్నారు. అందులో భాజపా 32,497, భారాస 18054, కాంగ్రెస్ 16,405 ఓట్లను సాధించాయి. కారుతో పోల్చితే కమలం పార్టీకి 14,443 ఓట్లు అధికంగా పడ్డాయి. ఇక్కడి ఫలితం భారాస మెజార్టీకి గండికొట్టింది. పట్టణ ఓటర్లు మైనస్‌గా మారినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు భాజపాకు కలిసొచ్చింది. సిద్దిపేట అర్బన్ మండలంలో భారాస 6595, భాజపా 5536, కాంగ్రెస్ 2586 ఓట్లు సాధించాయి. ఈ మండలంలో ప్రత్యర్థి పార్టీని అధిగమించిన గులాబీ పార్టీ 1059 ఓట్లు ఎక్కువగా పొందింది. సిద్దిపేట గ్రామీణ మండలంలో భారాస 10,313, భాజపా 4661, కాంగ్రెస్‌కు 2571 ఓట్లు నమోదయ్యాయి. ఇక్కడ కారు గుర్తుకు 5,652 ఓట్లు అధికంగా వచ్చాయి. నారాయణరావుపేట మండలంలో భారాస 6293, భాజపా 3335, కాంగ్రెస్ 1680 ఓట్లు సాధించాయి. ఇందులోనూ 2958 ఓట్లు గులాబీ పార్టీ ఆధిక్యం సాధించింది. చిన్నకోడూరు, నంగునూరు మండలాల్లో భారాస బలాన్ని చాటింది.

సిద్దిపేట నియోజకవర్గంలో
మొత్తం ఓటర్లు: 2,37,591
పోలైనవి: 1,74,969
ఆధిక్యం: 2678 (భారాస)

## అందని రాయితీ.. ఆందోళనలో రైతన్న!

పెద్దశంకరంపేట : వానాకాలం పంటల సాగుకు విత్తనాలను సేకరించేందుకు రైతులు సిద్ధమయ్యారు. తొలకరి వర్షాలు కురవగానే విత్తనాలు వేయాలని చూస్తున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి కూడా రాయితీని ప్రకటించలేదు. దీంతో ప్రైవేటు కంపెనీ విత్తనాలే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. తెలంగాణ రాష్ట్ర విత్తన సంస్థ కూడా రాయితీ లేకుండానే అమ్ముతోంది. గత్యంతరం లేక రైతులంతా ప్రైవేటుగా వరి, పత్తి, మొక్కజొన్న విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని, ధరలు భారంగా మారాయని అన్నదాతలు వాపోతున్నారు. రోహిణికార్తె సమీపించడంతో రైతులు విత్తనాల కొనుగోలు ప్రారంభించారు. వరి, పత్తి, మొక్కజొన్న వంటి విత్తనాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. వీటికి రాయితీ లేకపోవడంతో నేరుగా డీలర్ల వద్ద ప్రైవేటు కంపెనీవి కొనుగోలు చేస్తున్నారు. గత ఐదేళ్ల క్రితం వరకు పలు విత్తనాలపై ప్రభుత్వం రాయితీ ప్రకటించి రైతు సేవా కేంద్రాలు, ఆగ్రోస్, సహకార సంఘాల ద్వారా సరఫరా చేసేది. ఐదేళ్లుగా ఈ విధానాన్ని నిలిపివేయడంతో ప్రైవేటు కంపెనీలను ఆశ్రయిస్తున్నారు. వరి, కంది, పెసర, సోయాబిన్ వంటి విత్తనాలను 33 శాతం రాయితీపై అందించేది. ప్రభుత్వం విత్తనాలపై రాయితీ నిలిపివేయడంతో రైతులు పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది.

ధరలు పెరగడంతో...: వ్యవసాయశాఖ నుంచి ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ మాత్రమే 60 శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నారు. జిల్లాలో ఈ విత్తనాలు 6400 క్వింటాళ్లు అవసరం కాగా ఇప్పటి వరకు 5,476 క్వింటాళ్ల పంపిణీ చేశారు. బయట మార్కెట్‌లో టీఎస్ సీడ్ వరి విత్తనాలు 10 కేజీల బస్తా నాలుగేళ్ల కిందట రూ.500 నుంచి 600 వరకు ఉండగా, నేడు రూ.900 పైగా పలుకుతోంది. గతేడాది 4 కిలోల మొక్కజొన్న బస్తా ధర రూ.1500 ఉంటే ప్రస్తుతం రూ.1700కు చేరింది. పత్తి విత్తనాల ప్యాకెట్ సైతం కంపెనీని బట్టి గతేడాది కంటే రూ.100 నుంచి రూ.200 వరకు పెరిగాయి. ప్రతి ఏడాది విత్తన ప్యాకెట్లు, బస్తాలపై రూ.100 నుంచి రూ.200 వరకు పెరుగుతుండటంతో రైతులకు పెట్టుబడి భారం అవుతోంది. జిల్లాలో వానాకాలం 3,64,449 ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో విత్తన రాయితీ ఇస్తుందని అన్నదాతలు ఆశించినా, నెరవేరకుండా పోతోంది.

సర్కారే అందించాలి: మొగులయ్య, రైతుప్రభుత్వమే తక్కువ ధరకు నాణ్యమైన విత్తనాలు అందించాలి. రాయితీని తొలగించడంతో కొన్నేళ్లుగా ఆర్థిక భారం పడుతోంది. వరి, పత్తి విత్తనాల ధరలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో ప్రైవేటు కంపెనీలు ఇష్టానుసారం పెంచేస్తున్నారు. కేవలం జీలుగనే కాకుండా, అన్నింటికి అందించేలా చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం నిర్ణయం ప్రకారమే ముందుకు..

ప్రస్తుతం రాయితీపై జీలుగ విత్తనాలు మాత్రమే అందిస్తున్నాం. వీటి పంపిణీ దాదాపుగా పూర్తయ్యింది. ఇతర విత్తనాలకు ప్రభుత్వ రాయితీ ప్రకటించలేదు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. గోవింద్, జిల్లా వ్యవసాయ అధికారి







## గులాబీ బాస్ కీలక నిర్ణయం.. కేటీఆర్ ఔట్.. ఆ పదవి ఎవరికంటే..?

హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు ప్రతికూలంగా రావడంతో గులాబీ బాస్ తీవ్ర నిరాశకు గురయ్యారు. కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలకు ఎన్నికల ఫలితాలు నిరాశ కలిగించాయి. బీఆర్ఎస్ అధినేత వైఖరితో పాటు పార్టీలో కుటుంబ సభ్యుల పెత్తనంతోనే పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందంటూ లోపల, బయట పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అహంకారపూరిత వైఖరి పార్టీకి నష్టం చేస్తుందని కొందరు నాయకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో కేటీఆర్‌ను పార్టీలో కీలక బాధ్యతల నుంచి మార్చాలని గులాబీ బాస్ ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కేటీఆర్ స్థానంలో కుటుంబంలోనే మరొకరికి కేటాయించాలా లేదా బయట వ్యక్తులకు అప్పగించాలా అనేదానిపై కేసీఆర్ సమాలోచనలు చేస్తున్నారట. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు హరీష్‌రావుకు అప్పగించాలని లేదంటే ఎస్సీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఎవరినైనా ఒకరిని ఎంపిక చేసే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. రానున్నది ఎన్నికల కాలం కావడంతో పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకురా గలిగే నాయకులు ఎవరనేదానిపై గులాబి బాస్ ఫోకస్ చేశారట. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ క్లీన్‌స్వీప్ చేసింది. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ స్థానిక సంస్థల్లో బలపడే ప్రయత్నం చేస్తోంది. దీంతో ఈసారి ఎన్నికలు ఏకపక్షంగా ఉండబోవని.. కాంగ్రెస్‌తో పాటు బీజేపీ నుంచి పోటీ ఉంటుందని.. ఇద్దరి మధ్య పోటీని తట్టుకుని పార్టీని గెలుపువైపు తీసుకెళ్లగలిగే నాయకుడికి కీలక బాధ్యతలు అప్పగించాలని కేసీఆర్ ఓ నిర్ణయానికి వచ్చారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరికొద్దిరోజుల్లోనే బీఆర్ఎస్ సంస్థాగత మార్పులు తప్పవనే సంకేతాలు వెలువడుతున్నాయి.

**రేసులో ఎవరంటే..** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్‌ను తప్పించి.. ఆ స్థానంలో హరీష్‌రావుకు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు పార్టీలో సీనియర్లకు ఎవరికైనా ఈ బాధ్యతలు అప్పగించవచ్చనే చర్చ లేకపోలేదు. ఓవైపు కుమార్తె కవిత ఢిల్లీ మద్యం పాలసీ కేసులో జైలులో ఉండటంతో.. ఈ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తే పార్టీకి ప్రయోజనం ఉంటుందనే కోణంలో కేసీఆర్ ఆలోచన చేస్తున్నారట. మరోవైపు హరీష్‌రావు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు స్వీకరించేందుకు సానుకూలంగా లేనట్లు తెలుస్తోంది.

కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగి హరీష్‌కు బాధ్యతలు అప్పగిస్తే ఆయన ఎలా స్పందిస్తారనేది వేచి చూడాల్సి ఉంది.

**ఫ్యామిలీ పాలిటిక్స్ అనే ముద్ర..** బీఆర్ఎస్‌పై ఫ్యామిలీ పార్టీ అనే ముద్ర పడింది. గత పదేళ్లలో కుటుంబ సభ్యులకు ఇచ్చిన ప్రాధాన్యత ఉద్యమకారులకు, సామాన్య కార్యకర్తలకు ఇవ్వలేదనే వాదన ఉంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ఆయనకు కొంత ఇబ్బంది కలిగించిందనే చర్చ ఉంది. దీంతో ఆ ముద్రలు తొలగించుకోవడానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని పార్టీ సీనియర్లలో ఒకరికి అప్పగించవచ్చనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పుల్లో భాగంగా గులాబీ బాస్ పార్టీ కీలక బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారనే ఉత్కంఠ పార్టీ శ్రేణుల్లో కొనసాగుతోంది.

## ప్రధాని మోదీకి కేటీఆర్, హరీశ్ శుభాకాంక్షలు..

ప్రధాని నరేంద్ర మోదీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. 'దేశ ప్రధానిగా వరుసగా మూడో సారి ప్రమాణం స్వీకారం చేసిన మోదీజీకి అభినందనలు' అని పేర్కొన్నారు. 'దేశ ప్రజలకు మీరు (మోదీ), ఎన్డీయే ప్రభుత్వంలోని మంత్రివర్గ సహచరులు పూర్తి పదవీకాలమంతా విజయవంతంగా సేవలందించాలని కోరుకుంటున్నా' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు శుభాకాంక్షలు.. కేంద్రం నుంచి గణనీయమైన నిధులు తెచ్చి రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరుకుంటున్నా' అని హరీశ్ పేర్కొన్నారు.



## 18న రాష్ట్ర మంత్రి మండలి సమావేశం

## రైతు రుణమాఫీపై చర్చించే అవకాశం

హైదరాబాద్ : రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 18న జర గనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్యాబినెట్ భేటీలో పలు కీలక అంశాలు చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా రైతురుణమా ఫీని ఆగస్టు 15లోగా చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించా రు. ఈ అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే రాబోయే ఐదు సంవత్సరాలకు సంబంధించి సంక్షేమ, అభివృద్ధి ప్రణాళికలు ఎలా ఉండాలన్న దానిపై కూడా క్యాబినెట్‌లో చర్చించనున్నారు. వాస్తవానికి గత నెల్లో లోక్‌సభ ఎన్నికలు ముగియగానే క్యాబినె ట్ భేటీ కావాలని నిర్ణయించింది. ఎన్నికల్ కోడ్ అమల్లో ఉన్నందున తొలుత ఈసీ నుంచి అనుమతి రాలేదు. ఆ తర్వాత అనుమతి వచ్చినా కేవలం అత్యవసర అంశాలకు



సంబంధించి చర్చించాలని ఈసీ ఆదేశించింది. దాంతో మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయాలేవీ తీసుకోలేదు. ప్రస్తుతం కోడ్ ముగియడంతో పాటు పాలనపై పూర్థిస్థాయిలో దృష్టిసారించాలని రేవంత్ సర్కారు భావిస్తోంది.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194

## ప్రభుత్వ పాఠశాలలపై సీఎం రేవంత్ మరో కీలక నిర్ణయం

హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసేయొద్దని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుయకుంది. గత ప్రభుత్వంలో మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యార్థులు రావడం లేదని సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలను మూసివేసే పరిస్థితి ఉండేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులపై దృష్టి కేంద్రీకరించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని.. కానీ సింగిల్ టీచర్ పాఠశాలలను మూసేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రతీ గ్రామం, ప్రతీ తండాకు విద్యను అందించేలా ప్రభుత్వం ముందుకెళ్తుందని ఉద్ఘాటించారు. శిథిలావస్థకు చేరిన అన్ని ప్రభుత్వ పాఠశాలల భవనాలను పునర్నిర్మించేందుకు రూ.2వేల కోట్లతో పనులు ప్రారంభించామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను మహిళా సంఘాలకు అప్పగించామని తెలిపారు. ఈరోజు(సోమవారం) రవీంద్రభారతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి భేషజాలు లేవు.. పాలనకు సంబంధించి సలహాలు, సూచనలు ఎవరిచ్చినా తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే బాగుండేదన్నారు. వందేమాతరం ఫౌండేషన్ ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా తమ బాధ్యతను గుర్తు చేసిందని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలతో పోటీపడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం ప్రభుత్వానికి గర్వకారణమని చెప్పారు. కార్పొరేట్ పాఠశాలలతో ప్రభుత్వ విద్యార్థులు పోటీపడటం గౌరవాన్ని మరింత పెంచిందని ఉద్ఘాటించారు. విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. 90శాతం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రభుత్వ పాఠాశాలల్లో చదివినవారేనని గుర్తుచేశారు. తనతో సహా ప్రముఖ రాజకీయ నాయకులంతా ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివినవారేనని అన్నారు. గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్ ద్వారా తల్లిదండ్రులకు పిల్లల సంబంధాలు బలహీనపడుతున్నాయని ఒక స్టడీ రిపోర్ట్ వచ్చిందని తెలిపారు. గ్రామాల్లో ఉండే పాఠశాలలపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. విద్య మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. పెట్టుబడి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యపై పెట్టె పెట్టుబడి మన సమాజానికి లాభాన్ని చేకూరుస్తుందన్నారు. త్వరలో విద్య, వ్యవసాయ కమిషన్లను ఏర్పాటు చేసి నిరంతరం సమస్యలను పరిష్కరించే వెసులుబాటు కల్పించబోతున్నామని చెప్పారు. 10/10 వచ్చిన విద్యార్థుల అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇంటర్మీడియట్‌లోనూ స్టేట్ ర్యాంకులు సాధించి భవిష్యత్‌లో రాణించాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఉందని.. ప్రజా పాలనపై నమ్మకం కలిగించేలా ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## విభజన చట్టం అమలుకు తెలుగు రాష్ట్రాల కేంద్రమంత్రులు కృషి చేయాలి: సీఎం రేవంత్



హైదరాబాద్: కేంద్ర మంత్రులుగా ప్రమాణం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్(ట్విటర్) వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ నుంచి మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస్‌వర్మకు అభినందనలు తెలియజేశారు. విభజన చట్టం అమలు, కేంద్రం నుంచి తెలుగు రాష్ట్రాలకు రావాల్సిన నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ప్రాజెక్టుల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. మూడోసారి దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణం చేశారు. ప్రధాని తర్వాత ప్రమాణం పూర్తిచేసిన 71 మంది కేంద్రమంత్రుల్లో 30 మందికి క్యాబినెట్ హెూదా దక్కింది. ఐదుగురు స్వతంత్ర హెూదాలో ఉంటారు. మిగిలిన 36 మంది సహాయ మంత్రులు.

## తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఈటల రాజేందర్?

హైదరాబాద్: తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం దక్కడంతో రాష్ట్ర పార్టీలో కూడా భాజపా జాతీయ నాయకత్వం కీలక మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది. కిషన్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. భాజపాలో ఒకరికి రెండు పదవులు అనేది చాలా తక్కువ సందర్భాల్లోనే ఉంటుందని, కిషన్‌రెడ్డి స్థానంలో పార్టీకి కొత్త అధ్యక్షుడిని నియమించవచ్చని తెలుస్తోంది. ఈ పదవిలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను నియమించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

కొత్త పేర్లు కూడా పరిశీలించే వీలుందని పలువురు నేతలు విశ్లేషిస్తున్నారు. బండి సంజయ్ ఇప్పటికే జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తుండటం.. తాజాగా కేంద్ర మంత్రి అయిన నేపథ్యంలో ఒక పదవికే పరిమితం చేస్తారని చర్చ నడుస్తోంది. మరోవైపు



అమిత్‌షాను ఈటల రాజేందర్ కలిశారు. కేంద్ర మంత్రిగా ప్రమాణం చేసిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తాజా పరిణామాల నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేస్తా..: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: మోదీ కేబినెట్‌లో మరోసారి చోటు దక్కడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా కేబినెట్ మంత్రిగా పనిచేశానని, ఇప్పుడు రెండోసారి కేంద్ర మంత్రిగా అవకాశం వచ్చిందని చెప్పారు. కేంద్ర క్యాబినెట్‌లో ఎలాంటి శాఖ ఇచ్చిన సమర్ధవంతంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. తనను ఎంపీగా గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గతంలో కూడా ఎన్నో ప్రాజెక్టులు తీసుకొచ్చానన్నారు. కొందరు రాజకీయంగా తనను



విభేదించి.. కామెంట్లు చేసే మూరు?లను అసలు పట్టించుకోనన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు టెక్స్‌టైల్ పార్కు, రైల్వే ప్రాజెక్టులు , కేంద్ర సంస్థలు తీసుకొచ్చానని కిషన్ రెడ్డి తెలిపారు.

## మాజీ మంత్రి తలసాని సోదరుడు శంకర్‌యాదవ్ మృతిపట్ల కేసీఆర్ సంతాపం

హైరాబాద్: మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ మృతిపట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మోండా మార్కెట్ చైర్మన్ తలసాని శంకర్ యాదవ్ మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సికింద్రాబాద్ యశోదలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున కన్నుమూశారు. దీంతో మారేడ్‌పల్లిలోని నివాసానికి శంకర్ యాదవ్ మృతదేహాన్ని తరలించారు. ఆయన భౌతికకాయానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, బీఆఎస్ నేతలు పెద్ది శుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ నివాళులర్పించారు. మాజీ మంత్రి తలసానిని ఓదార్చారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660